# తమాషా కాపురం


సిహెచ్.వి. బృందావనరావు

నాలుగ్గంటలు కాగానే షాపులోంచి బయట కొచ్చాడు గుర్నాథం. చేతులు పైకెత్తి ఒళ్ళు విరుచుకొని అడుగు సారించి టీ షాపు దగ్గరికి బయల్దేరాడు. పొద్దున పదింటికి షాపు తెరిచిన దగ్గర్నించి, రాత్రి ఏడుగంటలదాకా షాపులో డ్యూటీ. మంచి రద్దీ అయిన ఏరియాలో వున్న షాపు కాబట్టి కస్టమర్లకు కొదవుండదు. రోజు రోజంతా తాన్లకు తాన్లు తీసి చూపిస్తూ ఉండడం, మళ్ళీ అవన్నీ చుట్టి షోకేసుల్లో సర్దడం – చేతులు పడిపోతాయి. ఇక ఆడవాళ్ళు వచ్చారంటే చెప్పే పనేలేదు. ఒక్క చీర కోసం వంద చీరలు తీసి చూపించాలి. తనతోపాటు మరో నలు



గురు గుమాస్తాలున్నారు కానీ వారంతా పాతికేండ్ల లోపువాళ్ళు. తనే అందర్లోకీ పెద్ద. నమ్మకంగా పని చేస్తాడని షాపు ఓనరుకు గుర్నాథమంటే గురి.

'స్ట్రాంగ్ టీ ఒకటి కొట్టు...' టీ షాపు వాడికి ఆర్డరిచ్చాడు గుర్నాథం. వాడు టీ కలుపుతూంటే దిక్కుల్చూస్తూ నిలబడ్డాడు. వున్నట్టుండి కొంచెం దూరంలో ఉండే సినిమాహాలు వైపు చూశాడు. ఎప్పుడో యాభైఏండ్లయింది ఆ హాలుకట్టి. అయినా దాన్ని కొత్తహాలనే పిలుస్తుంటారు. ఒట్టి తొక్కహాలు. మ్యాట్నీ ఇంటర్వెల్ అయినట్లుంది. జనం బయటి కొచ్చి టీ తాగి, దమ్ములాగేవాళ్ళు లాగుతున్నారు. పాత సినిమా కాబోలు జనం ఎక్కువమంది లేరు.



"ఇదుగో గురూ టీ...!' షాపువాడు టీ అందించాడు. గ్లాసు తీసుకొని ఒక గుటకేసి మళ్ళీ సినిమా హాలువైపు దృష్టిసారించాడు గుర్నాథం. ఇంటర్వెల్లో బయటికొచ్చిన జనం పల్చబడ్డారు. ఓ ముగ్గురు ఆడవాళ్ళు హాలు కాంపౌండ్‌లో తచ్చాడుతూ, గేట్లోంచి కనిపించారు. వాళ్ళల్లో ఒక మనిషిని 'అంబుజమేనా' అనుకుంటూ అనుమానంతో దీక్షగా చూశాడు. అవును అంబుజమే. చుక్కల్చీర కట్టుకొని వుంది.

'ఆరి దీనె–' అని ఒక బూతుతిట్టు మనసులోనే తిట్టుకొని, టీ తాగడం ముగించి, గ్లాసును రేకు స్టాండు మీద పెట్టి డబ్బులిచ్చాడు. జేబులోంచి సిగరెట్ ప్యాకెట్ తీసి ఒకటి వెలిగించి, పక్కనే వున్న పాన్‌షాపు దగ్గరికిపోయి, 'కిమాం కిల్లీ ఒకటి కట్టన్నా' అని ఆర్డరిచ్చాడు.

కిల్లీని నమిలి, మొదటి విడత రసాన్ని తృప్తిగా మింగి, కిల్లీని కుడిబుగ్గవైపుకు నెట్టుకొని సిగరెట్ దమ్ము గాఢంగా పీల్చి వాచీ చూసుకున్నాడు. 'ఇంకో పది నిముషాలు టైముంది అనుకుని, మళ్ళీ సినిమా హాలువైపు చూశాడు. హాలు కాంపౌండు నిర్మానుష్యంగా ఉంది. ఇంటర్వెల్ తర్వాత మళ్ళీ సినిమా మొదలైనట్టుంది. 'దీనికి ఈ అలవాటు మాత్రం పోదు' అనుకుంటూ షాపువైపు కదిలాడు గుర్నాథం.

❄ ❄ ❄

గుర్నాథం ఇంటికొచ్చేసరికి ఇంకా ఎనిమిది కాలేదు. వంటపనంతా దాదాపు ముగించేసి, టీ.వీ. ముందు కూర్చుని సీరియల్చూస్తున్నది భార్య. దండెం మీద చుక్కల చీర వేలాడుతున్నది. సినిమా నుంచి రాగానే ఆ చీర విప్పి కట్టుడు చీర కట్టుకొని ఇంటిపని లో నిమగ్నమైంది అనుకున్నాడు గుర్నాథం.

'మధ్యాన్నం యాడికి బోయినావు?' అడిగాడు భార్యను.

"నేనేడకు బోతా? ఈ ఇంటికీ నాకూ రాసి పెట్టుండె... ఇంక బయిటికి బోవడం గూడానా?' అంది అంబుజం.

గుర్నాధానికి మండింది. అంబుజం జుట్టు పట్టు కొని వంచి, వీపు మీద ఓ గుద్దు గుద్దాడు.

'దొంగ... అబద్దం గూడనా? సిన్మాహాలుకాడ నిన్ను జూళ్ళేదా నేను?' అని మళ్ళీ మీదికి పోయి నాడు. విదిలించుకుని పక్కకు తప్పించుకుంది అంబుజం.

'యిదుగో, యిప్పుడే జెబుతున్నా. వొంటిమీద చెయ్యి పడితే మర్యాదగుండదు. అయినా సినిమా గ్గాడ బోగూడదా? అమ్మ పెట్టా పెట్టదు అని...'– అంది అంబుజం.

'నీయమ్మ, ఎన్నిసార్లు బోతవే సినిమాకు. రోజూ బోవల్సిందేనా? పదేనురోజులకోసారి మనిద్దరం బోతూనేవున్నాంగదా. సాల్దా' అన్నాడు గుర్నాథం.

'అయినా రోజూ బోయిన్నా నేను. ఇయ్యాళంటే ఆ సుశీలొచ్చి తోడు రమ్మని వొకటే బతిమాలితే పోయినాగాని' అంది అంబుజం.

'ఛీ, నువ్వు మారవే' అని విసుక్కుంటూ, షర్టు విప్పుకుని బాత్‌రూంలోకి పోయాడు గుర్నాథం.

అంబుజం వయస్సు ముప్ఫయ్యయిదు. గుర్నాథం ఇంకా నలభైలో పడలేదు. వాళ్ళకు పెళ్ళయి పధ్నాలుగేండ్లవుతోంది. పిల్లలు కలగలేదు. ఏదో ఆ షాపులో పనిచేసుకుంటూ ఆ టౌన్లోనే కాలక్షేపం చేస్తున్నారు.

స్నానం చేసి బయటికొచ్చి టి.వి. ఛానల్ మార్చ బోయినాడు గుర్నాథం.

'ఆగాగు, సీరియల్ ఐపోవచ్చిందుండు' అని ఆపింది అంబుజం. అది చిన్న బ్లాక్ అండ్ వైట్ పోర్టబుల్ టి.వి. కొట్టాడన్న రోషం, సీరియల్ మీది వ్యామోహం రెండూ కలగలిసి వున్నాయి ఆమె మనసులో.

సీరియళ్ళన్నీ ముగించుకుని, పదింటికి లేచింది అంబుజం. అప్పటిదాకా ఆమెతోపాటు గుర్నాథం కూడా సీరియళ్ళు చూస్తూనే ఉన్నాడు. అన్నానికి కంచాలూ అవీ పెట్టి 'ఇంక మెక్కుదూ రా...' అని మొగుడిని సున్నితంగా పిలిచింది.

భార్య రుసరుసలు చూసి 'దీనికి రోజూ నాల్గు తగిలిస్తే గానీ మాటినదు' అనుకుంటూ అన్నానికూచున్నాడు గురునాథం. అంబుజం తను కూడా కూచొని కంచం ముందుకులాక్కుంది. కొంచెం సేపయ్యాక గుర్నాథం కంచంలో అన్నం కొద్దిగానే వుండడం చూసి మారు వడ్డించబోయింది.

'వొద్దు' అన్నాడు గుర్నాథం.

'పెట్టుకో. పెళ్ళాన్ని కొట్టడానికైనా సత్తువ గావాలిగా' అని ఓ అన్నం పెళ్ళ అతని కంచంలో వేసింది. 'బలముందని ఊరికూరికెనే చెయ్యెత్తుతడు పెద్ద మొగోడు' అని గొణుగుతూనే వుంది అంబుజం అన్నం తింటున్నంతసేపూ.

కంచాలూ అవీ తీసి, ఇల్లు సర్దుకుని, వంటిల్లు కడిగి తలుపులు వేసి వచ్చేసరికి పదిన్నర దాటింది. గుర్నాథం మంచమ్మీద పడుకొని కళ్ళుమూసుకుని వున్నాడు. నిశ్శబ్దంగా అతని పక్కన పడుకుని, డబుల్ కాట్ మీద అటువైపు మొహం పెట్టుకొని ఉండిపోయింది అంబుజం.

అంబుజం వొంటిరాపిడి తగలగానే భార్యవైపు తిరిగి ఆమె వొంటిమీద చెయ్యేశాడు గుర్నాథం. చెయ్యి పక్కకు నెట్టింది. మళ్ళీ ప్రయత్నించి అంబుజాన్ని తనపక్కకు తిప్పుకోబోయినాడు. ఆమె తిరగలేదు. అంబుజాన్ని దగ్గరికి పొదువుకుంటూ 'నా వొజ్రం, నా బంగారం' అంటూ మురిపాలు పోయినాడు గుర్నాథం.

'ఇంకా నయ్యం... ఇత్తడీ, కంచూ గాదూ'– అంటూ గుర్నాథం తలని గుండెలకదుముకుంది అంబుజం.

❄ ❄ ❄

పొద్దున్నే లేచి కాఫీలూ, స్నానపానాలూ అయిన తర్వాత తొమ్మిదిన్నర కల్లా చిన్నకేరేజీలో మొగుడికి అన్నం సర్దిచ్చింది అంబుజం.

సైకిలుకు కారేజీ తగిలించుకొని చక్రాల్లో గాలుందో లేదో చూసుకొని, షాపుకు బయల్దేరాడు గుర్నాథం.

ఇక అంతా తీరికే అంబుజానికి. పది నించి పన్నెండు దాకా టి.వి.లో వచ్చే అన్ని సీరియళ్లూ చూసింది. ఒంటిగంటకు భోజనం చేసింది. ఆ తర్వాత ముస్తాబు చేసుకొని, తలుపు తాళం వేసి రెండిండ్లవతల సుశీల ఇంటికి పోయి 'సుశీలా ఇనాయకు హాల్లో మంచి సినిమాంట. మహేష్ బాబుది పోదమొస్తవా' అని అడిగింది అప్పటికే తయారై రెడీగా వున్న సుశీలను. ●